
स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत-उज्ज्वल भविष्य Glorious Past-Brighter Future

# చెదిరిన గూడు

అంబల్ల జనార్థన్



## హై స్ట్రీట్ ఫీనిక్స్!

మధ్య ముంబాయిలోని ప్రముఖ వాణిజ్య సముదాయం ''లైఫ్‌స్టైల్'', ''బిగ్‌బజార్'' లాంటి అధునాతన షోరూంలు, లింటాస్, మధురాకోట్స్, స్టాన్ చార్ట్ బ్యాంక్ లాంటి కార్పొరేట్ సంస్థల ఆఫీసులు, పాతిక అంతస్థుల నివాస ఆవాసాలు వున్న సంకులం.

ఈ ప్రదేశం ఒకప్పుడు ఎత్తైన గొట్టం నుండి వచ్చే పొగతో బట్టల మిషీన్ల రణగొణ ధ్వనితో, కార్మికుల చెమట వాసనతో నిండి వుండేదంటే నమ్మడం కష్టం. కాని ఇది కళ్ల ముందున్న వాస్తవం!

అప్పుడది బడుగు జీవుల ఉపాధి కేంద్రం, వేల కార్మికులు ఇక్కడి మిల్లులో తమ నైపుణ్యానికి పదును పెట్టేవారు. ఈ పరిసరాలు కార్మికులతో కోలాహలంగా వుండేవి.

ఇప్పుడు, దీని ఎదురుగా కట్టిన ఫ్లై ఓవరుతో ఈ ప్రాంతం రూపు రేఖలే మారిపోయాయి. కార్ల మోతలే తప్ప జీవం తొణికిసలాడే జన సందోహం లేదు. చిత్ర విచిత్ర వేషధారణతో డాబు, దర్పం ప్రదర్శనే తప్ప, ఆత్మీయ స్పర్శ లేదు. ఇదంతా చూస్తుంటే గిద్దయ్యకు అయోమ

యంగా వుంది. తను ముప్ఫై ఏళ్ల పని చేసిన మిల్లేనా ఇది? ఇక్కడే గదూ తమ గది వున్న చాల్ (కొన్ని ఒంటి గదుల భవనం) వుండింది? ఆ చాల్ ఆనవాలు కూడా లేవేంటి? ఆ చోటులో ఈ విశాలమైన పార్క్ వుందేమిటి?

తమ నలభై కుటుంబాలను ఖాళీ చేయించి తమ జీవితాలను అస్తవ్యస్తం చేసింది ఈ బహుళ అంతస్తుల్లోని కోటీశ్వరుల వినోదానికా? అదే అడిగాడు కొడుకు రాజుబాబుని

''ఔ బాపూ ఈ ఇలాకలో మనసుంటోల్లకు జాగ లేదు. మా చిన్నప్పుడు ఆడుకున్న మైదాన్లు ఇప్పుడు పెద్ద ఆఫీసు బిల్డింగులైనయి. మీ మిల్లులు కోట్ల రూపాల ఫ్లాట్లయినవి. ఇరువై అంతురాల (అంతస్థులు) కన్న ఎక్కువున్న బిల్డింగులు కట్టే తందుకు మనసుంటి గరీబోల్లను వెళ్లగొట్టిన్రు. పైసలున్నోల్లకు సవులతులు (వసతులు) కూర్చే తందుకు మన కుటుంబాలను కూల్చివేసిన్రు. నువ్వు మునుపు పనిచేసిన జాగ ఇప్పుడెట్లయిందో నీకు సూపిచ్చేతందుకే నిన్ను ఇక్కడికి తోలుకచ్చిన''

గిద్దయ్య ఆలోచనలో పడ్డాడు. అతని ముందు గతం కదలాడింది.

దాదాపు యాభై ఏళ్లనాటి మాట...

తమ తాలుకాలోనే వెలిసి ఎంతో మంది చేనేత కార్మికులకు ఆలవాలం అయిన సహకార సంఘంలో అవకతవకలు బయటపడ్డాయి. చుట్టుపక్కల గ్రామాల్లోని నేతన్నలు వీధిన పడ్డారు. ముంబాయి భివండీలకు వలస బాట పట్టారు. తమ వూరి బక్కయ్య పుణ్యమా అని తను ముంబాయి వచ్చి ఫీనిక్స్ మిల్లులో చేరాడు. పని నేర్చుకునే వానిగా (లర్నర్‌గా) చేరిన తను శ్రద్ధతో పనిచేసి బదిలీ కార్మికునిగా, ఆ తర్వాత పర్మనెంటు వీవర్‌గా ఎదిగాడు. ఉద్యోగం ఖాయమయింది. తన కుటుంబం గాడిన పడింది. మిల్లు ప్రక్కనే పగిడి మీద ఓ గది సమకూర్చుకున్నాడు. ఇద్దరు పిల్లలు ఇక్కడే పుట్టారు. ఆ తర్వాత దగ్గర్లోని స్కూల్లో చేరారు. తాము సంవత్సరంకోసారి వూరు పోవడం, తమ చుట్టాలు ముంబాయి రావడం ఇలా ఓ పదేళ్లు సాఫీగా గడిచాయి. జీవితంలో స్థిరపడ్డా అనేంతలో పిడుగు పడింది.

ముంబాయి బట్టల మిల్లు కార్మికులతో దత్తా సామంత్ చేయించిన సమ్మె, వారి పాలిట సమ్మెట పోటయింది. దాదాపు ఇరవై నెలలు సాగిన ఆ సమ్మె, ముంబాయిలోని మిల్లులకు మరణ శాసనమైంది. అందరితోపాటు తమ కుటుంబం కూడా చితికింది. అవకాశం అందిపుచ్చుకున్న కొందరు శేట్లు తమ పాత మషీన్లను మార్చి అధునాతన, ఆటోమేటిక్ మషీన్లను అమర్చారు. నలుగురు కార్మికులు చేసే పనిని ఒక్క కార్మికుడు చేసే వీలున్న మషీన్లవి. మిల్లు నడుస్తుండగా మషీన్ల మార్పు సాధ్యం కాదు. యూనియన్ అనుమతి కావాలి. వుద్యోగాలు తగ్గించడానికి యూనియన్లెలాగు ఒప్పుకోరు. లే ఆఫ్ ఇస్తే పనిచేయకపోయినా ఆ కాలానికి జీతం ఇవ్వాలి. ఇలాంటి ఎన్నో ఇబ్బందుల్ని, కార్మికుల సమ్మె నెపంతో తమకు అనుకూలంగా మార్చుకున్నారు శేట్లు. కార్మికుల వేలుతో వారి కంటినే పొడిపించారు.

తమ మిల్లు ఓనరు ఓ అడుగు ముందుకేసి చాప కింద నీరులా అంచెలంచెలుగా కొన్ని విభాగాలను నగర శివార్లకు తరలించాడు. అలా ఖాళీ అయిన చోటుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం మొదలుపెట్టాడు. మిల్లు నష్టాలను అరికట్టడమే కాక పేరుకుపోయిన అప్పులను తీర్చాలనే నెపంతో మిల్లు జాగాలను కార్పొరేట్ సంస్థలకు బాడుగకు ఇచ్చాడు. అమ్మడానికి ప్రభుత్వ అనుమతి దొరికే అవకాశం లేనందున క్రమక్రమంగా తమ మిల్లు పరిసరాల్లో వేరే సంస్థలు దూరే వసతి కల్పించాడు. లోపాయికారిగా వారికి స్థలం అమ్మేశాడు.


సుదీర్ఘ సమ్మెతో హతాశులైన కార్మికులు చిట్టచివరకు విసుగెత్తి, గత్యంతరం లేని పరిస్థితులలో శేటు షరతులకి లోబడి మళ్లీ పనిలోకి చేరారు. మూసివేసిన విభాగాలకి చెందిన వారిని ఏదో ఓ కాడికి నష్టపరిహారం ఇచ్చి వదిలించుకున్నాడు శేటు. నగర శివార్లకి తరలించిన విభాగాల్లో పనిచేయ సమ్మతించని కార్మికులతో రాజీనామా చేయించాడు. జీతాలు లేక పస్తులకు తట్టుకోలేక అప్పుల్లోకి కూరుకు పోయిన కార్మికులు ఒత్తిడికి లోనై దక్కిన డబ్బే మహా అదృష్టంగా భావించి తమ ఉపాధికి తిలోదకాలిచ్చారు.

అదృష్టవశాత్తు తను పనిచేసే విభాగం మూత పడలేదు. తను అక్కడే వుద్యోగం కొనసాగించాడు. జీవితంలో మళ్లీ పుంజుకోసాగాడు. అంతలోనే మళ్లీ అశనిపాతం! ఇప్పుడు వుద్యోగానికే కాదు వుండే చోటుకి కూడా ఎసరు పెట్టాడు శేటు. మిల్లు జాగాలో వున్న 'చాల్'ను ఖాళీ చేయమని ఒత్తిడి తెచ్చాడు. వూపిరాడకుండా వుక్కుపాదం కింద నలిగిన తాము అందిన పరిహారంతో తృప్తి పడవలసి వచ్చింది. వున్న గూడును శేటు స్వాధీన పరచుకోవడంతో తమ నలభై కుటుంబాల వారు చెట్టుకొకరు, పుట్టకొకరుగా చెల్లాచెదురైపోయారు. రాజుబాబు స్కూల్ ఫైనల్ వరకైనా ఆ గదిలో వుండడానికి అనుమతి ఇవ్వమన్న తన కోరికను శేటు తోసిపు

स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत - उज्ज्वल भविष्य Glorious Past-Brighter Future

చ్చాడు. మహారాష్ట్రలోనే స్కూల్ ఫైనల్ పూర్తి చేస్తే రాజబాబును ఆ తర్వాత మనరాష్ట్రంలో చదివించవచ్చనేది తన ఆలోచన. ఆ పరిస్థితిల్లో భివండీకి వలసపోవడం తప్ప వేరే మార్గం కనిపించలేదు. రెండుగదుల పోర్షన్ అద్దెకి మాట్లాడి, కుటుంబాన్ని భివండీకి తరలించాడు. కొత్త చోటులో జీవితం కొత్తగా మొదలైంది.

చేసేపని అదే అయినా మిల్లులో పనికి భీవండీలో పవర్‌లూమ్ ఫ్యాక్టరీలో పనిచేయడానికి చాలా వ్యత్యాసం వుంది. ముంబాయిలో ఎనిమిదెనిమిది గంటల మూడు షిఫ్టులు. అంటే పనిగంటలు ఎనిమిది మాత్రమే. అదే భివండీలో పన్నెండు గంటలకో షిఫ్టు. పన్నెండు గంటల నుంచుండి పని చేయవలసి వచ్చేది. కాళ్లు పీక్కుపోయేవి. అంత చేసినా ముంబాయిలో వచ్చే జీతంలో సగం కూడా అక్కడ వచ్చేది కాదు. కుటుంబ ఖర్చులకి కటకటలాడవలసిన పరిస్థితి. ఏకార్మిక చట్టాలు వర్తించని రోజు 'హరీ' కూలీ వ్యవస్థ భీవండీ పవర్‌లూమ్ పరిశ్రమ. కార్మికులకు యూనియన్ లేదు. వారి తరపున వుద్యమించేవారు లేరు. అదే పవర్‌లూమ్ ఓనర్ల సంఘం వుంది. వారిలో ఐక్యత వుంది. అందుకని వారు ఆడింది ఆట, పాడింది పాట. వారికి అనుగుణంగా కార్మికులు మెదలాలి. ముంబాయిలోని తన వుద్యోగం గుర్తుకి వచ్చి కళ్లకు నీళ్లొచ్చేవి. నడివయస్సులో ఎంత యాతన? కుటుంబాన్ని పోషించడానికి భివండీలో అష్టకష్టాలు పడవలసి వచ్చింది గదా అని మనసు మూగగా రోదించేది. ఎలాగోలా రెండేళ్లు వెళ్లదీ



स्टेट बैंक ऑफ हैदराबाद
STATE BANK OF HYDERABAD
वैभवशाली अतीत • उज्ज्वल भविष्य Glorious Past-Brighter Future

శాడు. ఇక శరీరం సహకరించడం మానేసింది. చాలీచాలని తిండి, కఠోరశ్రమ... దాంతో ఆరోగ్యం క్షీణించింది. తన వూర్లో కలో, అంబలో తాగి శేషజీవితం గడపాలనే నిర్ణయానికి వచ్చాడు.

మిల్లు ఉద్యోగానికి రాజీనామా చేయగా వచ్చిన ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుటీ డబ్బులు బ్యాంకులో డిపాజిట్ చేశాడు. గది ఖాళీ చేసినందుకు శేటు ఇచ్చి నష్టపరిహారంతో సొంతూరులో అయిదెకరాల పొలం కొన్నాడు. తాము భివండీలో వున్నప్పుడు ఆ పొలం కౌలుకిచ్చాడు. అతివృష్టి, అనావృష్టిల చక్రవ్యూహంలో పడిన పొలంలో పంటలు సరిగా పండలేదు. మందులకు, ఎరువులకు, పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి రాలేదు. కౌలుదారి మోసం కూడా తను నష్టపోవడానికి కారణం.

భివండీలో తన అనారోగ్యం, వూర్లో పొలం వున్నా దానికి ఖర్చు పెట్టడమే అవుతోంది కానీ, దాని నుంచి ఆదాయం రాకపోవడం, వీటి వల్ల సొంత గూటికి తరలి పోవాలని నిశ్చయించాడు.

రాజుబాబు జిల్లా కేంద్రంలోని కాలేజీలో చేరాడు. ఎంసెట్‌ల యమబాధలు తట్టుకోలేక అతను కామర్స్‌లో చేరాడు. దీపిక ఊర్లోని ఉన్నత పాఠశాలలో చేరింది.

దాదాపు మూడు దశాబ్దాల తరువాత సొంత వూర్లో మరో ఉపాధి పర్వం మొదలయింది. విధి లీలలు తనకు అర్థం కావనుకున్నాడు. సేద్యంలో అనుభవం లేక రెండేళ్లు చాలా ఆటుపోట్లకి గురయ్యాడు. సొంత సేద్యంలో కూడా నష్టాలొచ్చాయి. వాటితో పాటు అనుభవం కూడా వచ్చింది. జీవితాన్ని గెలవాలనే పట్టుదలే తనని ముందుకు నడిపించింది. ఆ తర్వాత తిండికి బట్టకు దిగులు లేకపోయింది. రాజుబాబు డిగ్రీ పూర్తయింది. దీపిక చదువు స్కూల్‌ఫైనల్‌తో ఆగింది. రాజుబాబు ఉద్యోగం వేట, దీపికకు సంబంధాల వేట మొదలయింది. ఉత్తర, దక్షిణల ఆధారం లేక రాజుబాబు ఉద్యోగ రైలు గతి తప్పింది.

రాత పరీక్షలు, ఇంటర్వ్యూల స్టేషన్‌లో ఎక్కడం దిగడంతోనే నాలుగయిదు సంవత్సరాలు గడిచాయి. ఇలా అయితే లాభం లేదని, డిగ్రీ డాబుని పక్కన పెట్టి, కుట్టుపని నేర్చుకున్నాడు రాజుబాబు. ఆ నిర్ణయం తీసుకోవడం వెనుక ఎన్నో రోజుల మథనం, తర్జన, భర్జనలు, స్నేహితులతో, తల్లిదండ్రులతో సంప్రదింపులు అన్నీ వున్నాయి. బతుకు రైలు ముందుకు సాగడానికి అదే అనువైన, సులువైన మార్గంగా కనిపించింది. ఈ విషయంలో రాజుబాబు కంటే గిద్దయ్యే చాలా బాధపడ్డాడు. కొడుకును ప్రభుత్వ ఉద్యోగిగా చూడాలనుకున్న అతని కల భగ్నం అయింది.

మళ్లీ ముంబాయి జీవితం కళ్ల ముందుకు వచ్చింది. అప్పట్లో రోజులు ఎంత హాయిగా గడిచేవి! విధి తమతో ఎందుకు దాగుడు మూతలు ఆడుకుంటుందో అంతుబట్టలేదు. అలా బాధపడుతున్న తన బతుకులో ఓ కాంతి పుంజం. దీపికకు మంచి సంబంధం వచ్చింది. అబ్బాయి ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంటులో లైన్‌మెన్. చీకూ చింత లేని కుటుంబం, ప్రభుత్వోద్యోగం. ఇక ఆలోచించలేదు. కట్నం తన తాహతుకు మించినదైనా ధైర్యం చేశాడు. దీపిక పెళ్లి బాగానే జరిగింది. బ్యాంకు నిలువకు రెక్కలొచ్చాయి. అయినా ఓ బాధ్యత తీరింది అనే తృప్తి మిగిలింది. ఇక దృష్టి రాజుబాబు భవిష్యత్తు వైపు మరలింది. కుట్టుపని గిట్టుబాటుగానే వుంది. అతని పెళ్లి కూడా చేస్తే తను ఇక నిశ్చింతగా వుండవచ్చు. కానీ రాజుబాబు ఆలోచనలు వేరుగా వున్నాయి. జీవితంలో స్థిరపడ్డ తర్వాతే పెళ్లి చేసుకోవాలని అతని అభీష్టం. సొంత వూర్లో ఎంత కష్టపడ్డా...గొర్రెతోక ఆదాయమే. జీవితంలో పైకి రావాలంటే వున్న వూరు వదలాలి. శ్రమకు తగ్గ ఫలితం దక్కాలంటే ముంబాయిని మించిన చోటు లేదు. అందుకే ముంబాయి పోవడానికి వుద్యుక్తుడయ్యాడతను. ముంబాయి పోతే పో కానీ...పెళ్లి చేసుకొని వెళ్లమని తను...''తాదూర సందులేదు, మెడకో డోలు'' ఎందుకని రాజుబాబు...మూన్నెళ్ల వాదోపవాదాల తర్వాత రాజుబాబు ముంబాయి పోవడానికి ఒప్పుకున్నాడు తను.

రాత్రనకా, పగలనా పనిచేసి రాజుబాబు ముంబాయిలో నిలదొక్కుకున్నాడు. నగర శివార్లలో ఓ గూడు ఏర్పర్చుకున్నాడు. కుట్టుపని కార్మికుని నుండి కటింగ్ మాష్టరుగా ఎదిగాడు. ఆదాయం పెరిగింది. అప్పుడు పెళ్లి చేసుకోవాలనే ఆలోచన కలిగింది.

రెండేళ్ల క్రితమే రాజుబాబు పెళ్లి జరిగింది. ఆ తర్వాత తన జీవితంలో మరో సంక్షోభం! హాయిగా గవర్నమెంటు ఉద్యోగం చేసుకుంటున్న తన అల్లుడు చీటీల మాయాజాలంలో ఇరుక్కున్నాడు. అతని తోటి ఉద్యోగితో కలిసి చీటీల వ్యాపారం మొదలుపెట్టాడు. కొన్ని సంవత్సరాలు నమ్మకంగా వున్న అతని భాగస్వామి, ఓ దుర్దినాన కొన్ని లక్షల సొమ్ముతో పరారయ్యాడు. పొదుపు చేసిన మొత్తం కాక చీటీలు వేసిన వారి సొమ్ము కూడా పోయింది. పరువు నిలుపుకోవడానికి అల్లుడు అప్పులు చేసి వాటి వూబిలో కూరుకుపోయాడు. తను కూడా కొంత సొమ్ము సర్దాడు. లక్షల్లో వున్న అప్పు ప్రభుత్వోద్యోగంలో వుంటూ తీర్చడం కష్టమని అతను ఉద్యోగానికి రాజీనామా చేసి దుబాయి బాట పట్టాడు.

''ఏందే బాపూ బీరిపోయి గట్లనే నిలబడ్డవు?''

''బీరిపోక ఏం జెయ్యాల బిడ్డా? ఈ చాల్ల వున్నప్పుడు ఎంత సుకంగ వుండే! ఇప్పుడు జూడు నువ్వు బైటూర్లల్ల, మేము మనూర్లె, ఇద్దరు పిల్లలను పట్టుకొని దీపిక అత్తగారింట్ల, అల్లుడేమో దుబాయిల. అంతకింత తీన్ తీరన వాటరై పొయితిమి(విచ్చిన్నం అయ్యాము)'' కళ్లకు నీళ్లొచ్చాయి గిద్దయ్యకు.

''గట్లెందుకంటవే బాబూ? దినాలెప్పుడు ఒక్క తీర్గనే వుంటయే? నేను మెహనత్ చేస్తున్న, కొన్ని రోజులైనంక ఎక్స్‌పోర్టుకు బట్టలు కుట్టిపిస్త, ఆ తర్వాత కుట్టు ఫ్యాక్టరీ పెడ్త. పెద్ద ఇల్లు తీసుకుంట. బావను కూడా ఇక్కడికే పిలిపించి నా దందల(వ్యాపారంలో) సాయం చేయమంట. మిములను గూడ ముంబాయికి రప్పిస్త. అప్పుడు జూడు నీ పాత ముంబయి దినాలు మల్లస్తయి''

''దేవుని దయతోని నువ్వన్నట్టే జరుగనిబిడ్డా'' అంటూ ముందుకు నడిచాడు గిద్దయ్య. చెదిరిన తన గూడు మళ్లీ కుదురుకోవాలని గిద్దయ్య, తన తండ్రి కళ్లలో వెలుగు చూడాలని రాజుబాబు, తమలో తామే మనసులో మేడలు కడుతూ ఇంటి దారి పట్టారు.

